క్లుప్తంగా

నేడు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని వివరించారు. పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జూదరుల అరెస్టు

కాశినాయన : మండలంలోని కె.ఎస్.కొట్టాల సమీపంలో ఆదివారం జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.8,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవాంగుల సంక్షేమానికి కృషి



నాగశయనంను సన్మానిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వుట్టి నాగశయనం తెలిపారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ దేవాంగ సంఘం కార్యవర్గ సమావేశంలో ఏపీ అధ్యక్షుడిగా నాగశయనంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడానికి కార్యాచరణ చేపడుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగశయనంను ఆ సంఘం నాయకులు సన్మానించారు.

మంత్రికి వినతి



వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

చాపాడు: వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం జిల్లా తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆరోగ్య శాఖ ఉద్యోగులు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పుల భాస్కర్ యాదవ్, సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ సాదు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, వైఎస్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, కేసీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి నివాళి



మాజీ ఎంపీపీ ఓబయ్య యాదవ్ చిత్రం పటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

దువ్వూరు : మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య యాదవ్ ఈనెల 15న మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ దువ్వూరులోని మాజీ ఎంపీపీ స్వగృహానికి వెళ్లి జెర్రి నడిపి ఓబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ నడిపి ఓబయ్య నిరాడంబరుడని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఎమ్మెల్సీ కొనియాడారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, జెర్రి హరికృష్ణ యాదవ్, సంగన హరినాథరెడ్డి, పెంచికలపాటి రమణయ్య నాయుడు, దువ్వూరు ఉపసర్పంచ్ మురళి, వీవీ స్వామి, పుల్లగూర రామకృష్ణయ్య, వెన్నపూస సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

పీఎం కిసాన్ అర్హుల జాబితా సిద్ధం

అట్లూరు : పీఎం కిసాన్ అర్హుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో ఉందని, అర్హులు జాబితాను పొందవచ్చని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. అక్టోబర్ 5న 18వ విడత పీఎం కిసాన్ నిధి రూ.2 వేలు చొప్పున అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేస్తారన్నారు. అదే రోజు రైతుసేవా కేంద్రాల్లో ప్రధాని సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

చేలన్నీ బీళ్లే..

ఇప్పటి వరకు చినుకు రాలకపోవడంతో ఖరీఫ్ సాగుపై రైతుల ఆశలు ఆవిరైపోయాయి. గత ఏడాది ప్రకృతి వైపరీత్యాలకు వేసిన పంటలు చేతికందకుండా రైతన్నకు నష్టాలను మిగిల్చాయి. వరుణిడి కరుణ లేకపోవడంతో చాలా గ్రామాల్లో కాడి కట్టలేదని రైతులు వాపోతున్నారు.

- నేటితో ఖరీఫ్ సీజన్ పూర్తి
- సాగుకు నోచుకోని భూములే అధికం
- చినుకు కోసం రైతున్నల ఎదురుచూపులు



వరి పండే పొలాల్లో గడ్డి మేస్తున్న పశువులు

బద్వేల్(వ్యవసాయం): ఖరీప్ సీజన్ ముగిసినా.. బద్వేల్ నియోజకవర్గంలోని బద్వేల్, కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు, గోపవరం, అట్లూరు మండలాల్లో సాగుకు అవసరమైన వర్షపాతం నమోదు కాలేదు. ఎండలు మండుతూ వర్షం కురుస్తుందనే నమ్మకం సన్నగిల్లుతోంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల ప్రవేశం జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ ఉంటుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ప్రవేశించి రెండు నెలలు దాటినా బద్వేల్ నియోజకవర్గంలో వర్షం జాడ లేదు. రోజూ కారుమబ్బులు రైతులను ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి.

కష్టపడి విత్తనం కొనుగోలు చేసినా...

బద్వేల్ నియోజక వర్గంలో పత్తి, కంది, వరి, తదితర పంటలు విపరీతంగా సాగుచేస్తారు. ఖరీఫ్ సాగులో భాగంగా విత్తనాల కోసం రైతులు నానా వస్థ పడుతున్నారు. క్యూలో నిలబడి గొడవపడి బ్లాక్‌లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసినా విత్తనం వేసే పరిస్థితి లేదు. ఈ ఏడాది వర్షాలు కురవక ఇప్పటి వరకు రైతులు పొలం పనులకు వెళ్లలేదు. బోరు బావుల్లోనూ నీరు అడుగంటడంతో ఆందోళన చెందుతున్నారు.

అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి

కలసపాడు, కాశినాయన మండలాల్లో వేల ఎకరాల్లో అడ్డకాడి కట్టలేదని రైతులు తెలిపారు. పోరుమామిళ్ల బి.కోడూరు, బద్వేల్, గోపవరం, అట్లూరు మండలాల్లో బోరుబావుల కింద అడపాదడపా పైర్లు సాగయ్యాయి. బద్వేల్ సమీప గ్రామమైన తొట్టిగారి పల్లెలో మెట్ట పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. చెరువులకు నీరు చేరకపోవడంతో వరి పోలాల్లోనూ ఇదే పరిస్థితి. పొలంలో దుక్కులు చేయకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. వరి పండే భూములు ఇప్పుడు పశువులకు మేతగా మారాయి. రైతులు పొలాల వైపు కన్నెత్తి చూడటం లేదు.

వర్షం కోసం ప్రతి రోజూ ఎదురుచూశాం



వర్షం కురుస్తుందని ఆకాశం వైపు కళ్లప్పగించి ఎదురు చూస్తున్నాం. జూన్ నెల నుంచి ఇదే పరిస్థితి. పొలాల్లో ఇంత వరకూ అడ్డకాడి కట్టలేదు. అప్పడప్పుడూ తుంపర చినుకులకు చేలల్లో గడ్డి మొలిచింది. దీంతో పశువుల మేత కోసం వదలిపెట్టాం. తిండి గింజల కోసం బోర్ల కింద వరి పైరు వేసుకున్నాం.

\- కాకర్ల చెన్నారెడ్డి, రైతు, బద్వేల్


నష్టాలు తప్పితే లాభాలు రావడం లేదు



పైర్లు వేస్తే నష్టాలు మాత్రమే మిగులుతున్నాయి. 80 సెంట్ల పొలంలో జొన్న వేస్తే రూ.18 వేలు పెట్టుబడి అయింది. ఐదు నెలలపాటు పొలంలో కష్టం చేస్తే రూ.25 వేలు వచ్చింది. పెట్టుబడి, రెక్కల కష్టం కలుపుకొంటే మిగిలింది నష్టమే. అందుకే కూరగాయలు వేసుకుంటున్నా. వాటిలో పది రూపాయలు కళ్ల చూస్తున్నా.

\- పి.శంకర్ రెడ్డి, రైతు, కొంగలవీడు

మరమ్మతులు చేపట్టరూ..!



నిరుపయోగంగా నీటి ట్యాంక్

గోపవరం : మండలంలోని టి.సండ్రపల్లె దళితవాడలో తాగునీటి పథకం నిరుపయోగంగా మారింది. దీంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి పథకానికి సంబంధించిన పైపులు ఊడిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. స్థానికులు అనేకమార్లు ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవు. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ఇలా నిరుపయోగంగా వదిలేయడంతో.. క్రమేణా ట్యాంకు దెబ్బతినే ప్రమాదం కూడా ఉంది. సోమవారం స్థానికులు నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం దుస్థితిని ఎంపీడీఓ రామకృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయించి పథకాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

ఎంవీఆర్‌కు ఘన నివాళి



ఎంవీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, ఆర్‌సీపీఈ కళాశాల అధ్యాపకులు

ప్రొద్దుటూరు : రాయలసీమ ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి మూడో వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలోని డాక్టర్ ఎంవీఆర్ విగ్రహానికి కళాశాల కరస్పాండెంట్ ఉమామురళీధర్‌రెడ్డి, తనయుడు మురళీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవి శంకర్‌తోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నదానం

డాక్టర్ ఎంవీ రమణారెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ కౌన్సిలర్ సింగంశెట్టి గుమ్మటమయ్య, కొండూరు వెంకటసుబ్బయ్య ఆర్టీపీపీ రోడ్డులోని విశ్వ ప్రేమ వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీ రమణారెడ్డి రెండో కుమారుడు మల్లేల రాజారాంరెడ్డి ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులకు, వృద్ధులకు, సాధువులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సునీల్ కుమార్, నారాయణరెడ్డి, రాజు, లాయర్ సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

12వ పీఆర్సీ అమలులో జాప్యం ఎందుకు ?



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలులో జాప్యం ఎందుకు చేస్తోందని ఏపీ ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో కన్వీనర్ సలీం అధ్యక్షతన ఎస్టీయూ ప్రొద్దుటూరు రీజియన్ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, పదవీవిరమణ ప్రయోజనాలు, పాత బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పని సర్దుబాటులో జరిగిన లోపాలను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాలకులు ప్రయత్నమే చేయడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలకు ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కమిటీ ప్రభుత్వం 100 రోజుల పాలన దాటినా కూడా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదని విమర్శించారు. ఎస్టీయూ జిల్లా నాయకులు నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి, రామ్మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీద్ ఖాన్, గురుకుమార్, కొత్తపల్లి శీను, సంజీవరెడ్డి, సుబ్బరాయుడు, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు వాసికి డాక్టరేట్



ఒద్దెపోగు విజయకుమారి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సురేంద్రనగర్‌కు చెందిన దళిత నాయకులు ఓ.ఎస్.వి. ప్రసాద్, మంజులమ్మ కుమార్తె అయిన ఒద్దెపోగు విజయకుమారి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఈమె ఇంటిగ్రేటెడ్ హైడ్రో జియాలాజికల్ అండ్ జియో ఫిజికల్ స్టడీస్ ఆఫ్ పెద్దవంక వాటర్ ఏరియా గద్వాల్ జిల్లా తెలంగాణ స్టేట్ అనే అంశంపై యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ టి.మధు పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించగా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ఆచార్యులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోల్‌వాల్ట్ పోటీలకు ఎంపిక



విద్యార్థి త్రివిక్రమ్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఫాతిమా ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి ఎస్.త్రివిక్రమ్ రాష్ట్ర స్థాయి పోల్‌వాల్ట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిష తెలిపారు. కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోల్‌వాల్ట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసమోహన్‌ను ప్రధానోపాధ్యాయురాలు, మదర్ గ్రేసీ అభినందించారు.

విద్యార్థుల పెండింగ్ చార్జీలు విడుదల చేయాలి



విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు

మైదుకూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్స్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం–1 వద్ద విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్ర బాబు మాట్లాడుతూ దాదాపు 9 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు విడుదల చేయకపోవడం వలన హాస్టల్ వార్డెన్లు సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి తాకుతున్నాయని, మరోపక్క అరకొర ఇచ్చే మెస్ చార్జీలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం సరైందని కాదన్నారు. పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పౌరాణిక జానపద రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కొనియాడారు. స్థానిక జార్జికారోనేషన్ క్లబ్‌లో చిలకమర్తి లక్ష్మీనరసింహం 158వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, రచయితగా లక్ష్మీనరసింహం దేశానికి అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రచయిత రామసుబ్బారెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలు



పంగావాండ్లపల్లెలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ కుళాయి కనెక్షన్లపై విచారించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా కుళాయి కనెక్షన్లు కలిగి ఉంటే వెంటనే రెగ్యులరైజ్ చేసుకోవాలని, ఇందుకోసం ఆయా సచివాలయాల్లో అమెనెటిస్ సెక్రటరీలను సంప్రదించాలని కోరారు. అలాగే నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి, ఇంటి పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ప్రతి సచివాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం పంగావాండ్లపల్లె, పంగావాండ్లపల్లె ఎస్సీకాలనీలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య సమస్య ఉన్నట్లు గ్రామస్తులు కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో తక్షణమే పరిష్కరించాలని ఇంజినీరింగ్, సిబ్బందిని ఆదేశించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రొద్దుటూరు కల్చరల్ : భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిశోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముందుగా స్థానిక గాంధీరోడ్డులోని మెయిన్ బ్రాంచ్ నుంచి గాంధీ రోడ్డు మీదుగా మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూల్ వరకు అన్ని బ్రాంచుల ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్‌లో పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ కడప రీజనల్ సెక్రటరీ సంజీవ ఆనంద కుమార్, బ్యాంకు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయం పరిశీలన



ఆలయ నిర్మాణానికి వాస్తును పరిశీలిస్తున్న సుబ్రమణ్యం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల సమీపంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని రాయలసీమ ఎండోమెంట్ జోన్ ఆర్కాలజిస్టు సుబ్రమణ్యం ఆదివారం పరిశీలించారు. ఆలయ ఆవరణను పరిశీలించి నూతన ఆలయాన్ని నిర్మించేందుకు వాస్తు పరిశీలన చేయడం జరిగింది. ఈ ఆలయంలో నిత్యం అన్నదానం చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీమకు చంద్రబాబు ద్రోహం చేయడం తగదు

ప్రొద్దుటూరు : రాయలసీమకు సీఎం చంద్రబాబు నాయుడు ద్రోహం చేయడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ (ఉసురుపాటి బ్రహ్మయ్యవర్గం) గద్దం నరసింహులు మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప కొప్పర్తిలో కేటాయించిన ఎంఎస్ఎంఈని అమరావతికి తరలించడమంటే రామలసీమకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. 2014–19లో పద్మావతి యూనివర్సిటీలో రాయలసీమ విద్యార్థినులకు మెడికల్ సీట్లు దక్కకుండా చేశారన్నారు. రాయలసీమకు కేటాయించిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారని, పలు కేంద్ర సంస్థలను అమరావతికి తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాయలసీమ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

దెబ్బతిన్న కల్వర్టు

- పట్టించుకోని అధికారులు



కల్వర్టు కుంగడంతో ఏర్పడిన రంధ్రం

రాజుపాళెం : మండలంలోని వెంగలాయపల్లె నుంచి సోమాపురం గ్రామాల మధ్యలో ఓ చోట కల్వర్టు కుంగిపోయింది. ఆరు నెలల కిందట కల్వర్టు దెబ్బతిన్న ఇప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆదారిలో వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ దారిలో వాహనదారులు కిందపడి గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఆ దారి అర్కటవేముల, పర్లపాడు, ఉలవపల్లె, కొత్తపల్లె, పెద్దపసుపల, జమ్మలమడుగుకు వెళుతుంది. ఏదైనా పెద్ద ప్రమాదం జరగక ముందే అక్కడ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గోవుల సంరక్షణ యజమానుల బాధ్యత



ట్రాఫిక్ అడ్డంగా ఉన్న గోవులను పక్కకు తోలుతున్న పోలీసులు

పోరుమామిళ్ల (అట్లూరు) : గోవుల సంరక్షణ యజమానుల బాధ్యత అని పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్లలో గోవులను రోడ్లపై వదిలేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు రోజులు గడువు ఇస్తున్నామని, అప్పటికీ స్పందించకపోతే ఆవులను గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో నాతియా మెహఫిల్



మాట్లాడుతున్న హజరత్ సయ్యద్ షా మహమ్మద్ షేహ్జాద్ హుసేని సాహెబ్

కడప కల్చరల్: కడప నగరంలోని అస్తానె హుసేనియా పీఠంలో ఆదివారం పవిత్ర మిలాదున్ నబీ మాసోత్సవం సందర్భంగా నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాత్ ఖాన్‌లు పాల్గొని ప్రవక్త పట్ల తమ భక్తిని చాటుకున్నారు. ఆస్థానె హుసేనియా పీఠాధిపతి సయ్యద్ షా మహమ్మద్ షేహ్జాద్ హుసేని సాహెబ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి నాతియా మెహఫిల్ నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కవులు తమ నాతియ కలాంలతో అత్యద్భుతంగా ఆలపించారు. మత గురువులు, ప్రముఖ కవులు, ముస్లిం ప్రముఖులు, మౌల్వీలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గుంతబజార్ సర్కిల్‌లో..

మహా ప్రవక్త మహమ్మద్ జయంతిని పురస్కరించుకుని కడప గుంతబజార్ సర్కిల్‌లో మంగళవారం నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సుబాన్‌బాష తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ముస్లింలు, గురువులు పాల్గొంటారన్నారు.

వరికి ఎర్ర తెగులు .. రైతు దిగాలు

- దిగుబడులపై ప్రభావం చూపుతుందంటున్న అన్నదాత
- మండలంలో 560 ఎకరాల్లో వరిపంట సాగు

కాశినాయన : వరి సాగు చేసిన రైతులు దిగులు చెందుతున్నారు. పంటకు ఎర్ర తెగులు సోకడంతో ఆందోళనకు గురవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, నకిలీ ఎరువులు అన్నదాతను నట్టేట ముంచుతున్నాయి. వేల రూపాయలు ఖర్చు చేసి పంటలను సాగు చేస్తే తెగుళ్ల బెడద ఎక్కువైందని వాపోతున్నారు. మండలంలో 560 ఎకరాల్లో రైతులు బోరుబావుల కింద వరిపంటను సాగు చేశారు. కొంత పంట పొట్ట దశకు వస్తుండగా.. మరికొంత పంట గంటకట్టే దశలో ఉంది. ఈ తరుణంలో ఎర్ర తెగులు ఉధృతి ఎక్కువ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పురుగు మందులను పిచికారీ చేస్తున్నా నివారణ కావడం లేదని వాపోతున్నారు. ఖరీఫ్‌లో సరైన వర్షాలు పడకపోవడంతో దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తాయని, దీనికి తోడు ఎర్ర తెగులు ప్రభావంతో మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించి తెగులు నివారణకు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



ఎర్ర తెగులు సోకిన వరిపంట



డ్రోన్ ద్వారా వరిపంటకు మందు పిచికారీ చేస్తున్న రైతులు